బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహణ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్‌తో సమావేశమైన ఉమ్మడి మెదక్ జిల్లా నేతలు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, యాదవరెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి

కేసీఆర్‌తో సమావేశమైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గణేశ్ బిగాల, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంతు షిండే, జీవన్‌రెడ్డి, ముజీబుద్దీన్, ఆయేషా

రెండు జిల్లాల ముఖ్య నేతలతో
కేసీఆర్ భేటీ

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నిర్వహణ, ఏర్పాట్లపై నేతలకు దిశానిర్దేశం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను వరంగల్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతలతో పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు బుధవారం ఎర్రవెల్లి నివాసంలో సమావేశమయ్యారు. మహాసభ నిర్వహణ, ఏర్పాట్లపై వారితో చర్చించారు. పలు అంశాలపై వారికి అధినేత దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, డాక్టర్ యాదవ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ బిగాల, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అశన్నగారి జీవన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, నాయకురాలు అయేషా షకీల్‌తోపాటు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులు హాజరయ్యారు.

లోకం పోకడ

కొత్తగా ఈ శాఖ తప్పక అవసరమని రెడీ చేసి పెట్టాను సార్!

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు

పసుపు @ రూ.14,669

మెట్‌పల్లి మార్కెట్‌లో రికార్డు ధర

మెట్‌పల్లి, ఏప్రిల్ 2: పసుపు ధర ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నది. బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు కాడి రకానికి గరిష్ఠంగా క్వింటాల్ ధర రూ.14,669 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. రెండు, మూడు రోజులుగా పెరుగుతున్న ధరలతో ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ మెజార్టీ రైతులకు పెద్దగా ఒరిగేదేమి లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఇప్పటికే మెజార్టీ రైతులు దాదాపు 80 శాతం మేర పసుపును మార్కెట్‌లో విక్రయించారు.

సమస్యలపై ఉద్యోగుల పోరుబాట

జేఏసీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయీస్ చైర్మన్ జగదీశ్వర్ వెల్లడి

కొత్తపల్లి, ఏప్రిల్ 2: ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి ఉద్యమబాట పట్టినట్టు జేఏసీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయీస్ చైర్మన్ జగదీశ్వర్ తెలిపారు. ఈ నెల 1న ప్రారంభమైన ఉద్యమ కార్యాచరణ 30వరకు కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగులకు పెండింగ్ డీఏ విడుదల, ఆరోగ్య కార్డుల మంజూరు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలనే తదితర డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించడంతోపాటు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను సమర్పిస్తామని చెప్పారు. నీటిపారుదల శాఖ సీనియర్ అసిస్టెంట్ గూడ రాఘవరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన 5 డీఏలు, పెండింగ్ బిల్లులు, కంట్రిబ్యూషన్‌తో కూడిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం, పీఆర్సీ అమలు, విరమణ పొందిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

ఈనెల 30 వరకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు ప్రకటించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో నెల వరకు పొడిగించింది. గతనెల 31తేదీతో ఓటీఎస్ గడువు ముగియగా, దీనిని ఈనెల 30 వరకు పొడిగిస్తూ గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జీవో జారీచేశారు.

మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తేతెలంగాణ): రానున్న మూడ్రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భూ ఉపరితలం వేడెక్కడం, ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురిసే అవకాశమున్నదని అంచనా వేసింది. గురు, శుక్రవారాల్లో వడగండ్ల వర్షం పడొచ్చని సూచించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గురువారం ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్, మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారం ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్.. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం సూచించింది. ద్రోణి ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశమున్నదని పేర్కొంది. బుధవారం భద్రాచలం –కొత్తగూడెం జిల్లాలో 39.4 డిగ్రీలు, ఖమ్మంలో 37.4, ఆదిలాబాద్‌లో 37, నిజామాబాద్‌లో 36.5, మెదక్‌లో 36.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది.

రజతోత్సవ సభకు అంకురార్పణ

- పూజతో మహాసభ పనులు ప్రారంభం
- ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల ఆధ్వర్యంలో భూమి చదును, వేదిక ఏర్పాట్లు షురూ
- 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ



బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల అంకురార్పణ పూజలో పాల్గొన్న పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ వీ లక్ష్మీకాంతారావు-సరోజన దంపతులు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎం సుధీర్‌కుమార్, మర్రి యాదవరెడ్డి, కే వాసుదేవరెడ్డి, వై సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి

వరంగల్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, పదేండ్ల సుపరిపాలన మేళవింపుగా ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు మొదలయ్యాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల పనులకు బుధవారం పూజ కార్యక్రమంతో అంకురార్పణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ఆ ప్రాంగణంలో సందడి కనిపించింది. సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటుచేసిన స్కై బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహాసభ నిర్వహించే ప్రదేశాన్ని ప్రొక్లయిన్‌తో చదును చేయడం మొదలుపెట్టారు. 1,213 ఎకరాల విశాల ప్రాంగణంలో అన్ని వసతులు కల్పించేలా పనులు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వ్యవస్థాపక నాయకుడు, మాజీ ఎంపీ వొడితెల లక్ష్మీకాంతారావు-సరోజన దంపతులు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎం సుధీర్‌కుమార్, మర్రి యాదవరెడ్డి, కే వాసుదేవరెడ్డి, వై సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో సకల ఏర్పాట్లు

తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల ప్రస్థానం సందర్భంగా ఏప్రిల్ 27న మరో అద్భుతం ఆవిష్కృతం కానున్నది. లక్షలాది మందితో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జరగనున్నది. ఎల్కతుర్తి మండల కేంద్రం బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు ముస్తాబవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ప్రజలు, వేలాది వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఉండే ఎల్కతుర్తిని రజతోత్సవ మహాసభ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు రజతోత్సవ మహాసభ ఏర్పాట్లలో నిగమ్నమయ్యారు. రజోత్సవ మహాసభ వేదిక, బహిరంగసభ, వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన అన్ని వసతుల కల్పనకు వేగంగా ప్రణాళిక రూపొందించారు. 60 ఏండ్ల ఆకాంక్షల ప్రతిరూపంగా 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన బీఆర్ఎస్, అలుపెరగని పోరాటాలతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసింది. 2014 నుంచి పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశానికే దిక్సూచిగా నిలిపింది. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల సుపరిపాలన మేళవింపుగా ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వేదికగా 'బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ' జరుగుతున్నది. భారీ బహిరంగ సభలు అంటేనే బీఆర్ఎస్ అని దేశ రాజకీయాల్లో నానుడి ఉన్నది. స్వరాష్ట్ర సాధన లక్ష్యంగా సాగిన ఉద్యమ ప్రస్థానంలో భాగంగా బీఆర్ఎస్ ఎన్నో భారీ బహిరంగ సభలను నిర్వహించింది. వరంగల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలు ప్రపంచ రికార్డులను నమోదు చేశాయి. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సైతం అదే స్థాయిలో ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 1,059 ఎకరాల్లో వాహనాల పార్కింగ్, 154 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఎండాకాలం కావడంతో ప్రజలు ఇబ్బంది పడకుండా బహిరంగసభ ప్రదేశంలో 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను అందించనున్నారు. మరో 10 లక్షల అర లీటరు నీళ్ల బాటిళ్లను సిద్ధం చేశారు. సభ నిర్వహణకు అనుగుణంగా 15 వందల మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలు, పురుషుల కోసం వేల సంఖ్యలో టాయిలెట్లు, అత్యవసర వైద్యసేవలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచనున్నారు.



25 ఏండ్ల చరిత్ర ఆవిష్కృతం: ఎర్రబెల్లి

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభలో 25 ఏండ్ల పార్టీ చరిత్ర ఆవిష్కృతం కానున్నదని, దేశంలోనే అతిపెద్ద సభగా ఎల్కతుర్తి సభ నిలుస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. రజతోత్సవ మహాసభకు ప్రజలు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేయాలని పిలుపునిచ్చారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా నేతలతో కలిసి దయాకర్‌రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, నేడు కాంగ్రెస్ పాలనలో అధోగతి వైపు సాగుతున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో తాగునీటికి, సాగునీటికి ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను కాదనుకుని తప్పు చేశామని ప్రజలు విచారం వ్యక్తంచేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చిన తర్వాతే హైదరాబాద్, వరంగల్ బాగుపడ్డాయని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడంలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ మరిచిపోయిందని దుయ్యబట్టారు. మహాసభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ మహాసభకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతి కార్యకర్త సైనికుడై పనిచేయాలి: దాస్యం

రజతోత్సవ మహాసభ విజయవంతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడి మాదిరిగా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 15 నెలల్లోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నదని విమర్శించారు. చరిత్రాత్మక మహాసభను ఇక్కడ నిర్వహించే అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం: పోచంపల్లి

రజతోత్సవ మహాసభకు తరలివచ్చే ప్రజల కోసం సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మూడు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న ఎల్కతుర్తిని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మహాసభ నిర్వహణకు ఎంపిక చేశారని చెప్పారు. మహాసభ ప్రాంగణం కాకుండా మూడు వైపులా పార్కింగ్ కోసం వెయ్యి ఎకరాలను సేకరించామని, వాహనాల రాకపోకల కోసం అంతర్గతంగా కొత్త రోడ్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కేసీఆర్ సూచనలను పాటిద్దాం: తక్కళ్లపల్లి

ఉద్యమం సమయంలోనూ, అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ అనేక మహాసభలను నిర్వహించిందని, ఈ రజతోత్సవ మహాసభ కూడా గొప్పగా ఉంటుందని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ సూచనల మేరకు మహాసభ నిర్వహణ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం కనీవినీ ఎరగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

అతిపెద్ద సభగా కీర్తికెక్కాలి : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రపంచంలోని ఐదు అతి పెద్ద సభల్లో ఒకటిగా గతంలో వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన సభ ఉన్నదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రజతోత్సవ సభను ప్రపంచంలోనే అతి పెద్ద సభగా కీర్తికెక్కేలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఇచ్చిన పిలుపును క్రమశిక్షణతో అమలుచేసిన చరిత్ర వరంగల్‌కు ఉన్నదని, రజతోత్సవ మహాసభను విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. తెలంగాణను తెర్లు చేస్తున్న దొంగలను తరిమికొట్టే రోజు వచ్చిందని అన్నారు. మహాసభకు ప్రజలు కూలి పని చేసుకుంటూ స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు ఇది నిదర్శనమని చెప్పారు.

అందరి సహకారం కావాలి: వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తిలో రజతోత్సవ మహాసభను నిర్వహించడం మనమందరం గర్వించదగ్గ విషయమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల మహాసభను హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. మహాసభ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని, మిగిలిన అన్ని వర్గాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలం కోసం తమ భూములు వాడుకోండి అంటూ ముందుకు వచ్చిన ఎల్కతుర్తి, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాల్‌పూర్ రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బహుజన పోరాటయోధుడు పాపన్న

ఆ మహనీయుడిని గౌరవించింది కేసీఆరే

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. బడుగుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని బుధవారం ఎక్స్ వేదికగా కొనియాడారు. ఆ మహనీయుడి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో జయంత్యుత్సవాలు, వర్ధంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

కలెక్టర్ సందీప్ జైలుకు పంపాల్నా?

మొదటిపేజీ తరువాయి...

సవాల్ చేస్తూ అప్పీలు పిటిషన్ దాఖలు చేసి దానిపై ఎలాంటి ఉత్తర్వులు పొందకపోయినప్పటికీ, అంతకు ముందు కోర్టు జారీచేసిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. ఒకపక్క ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్.. బేషరతుగా తప్పు జరిగిందని ఒప్పుకుంటుంటే.. మరోవైపు కలెక్టర్ తన న్యాయవాదిని నియమించుకొని తప్పు ఏమీ కాలేదు అన్నట్టుగా వాదనలు వినిపించడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. హైకోర్టు ఆర్డర్ చట్ట వ్యతిరేకం అంటూ బాధితురాలిపై క్రిమినల్ కేసు నమోదు చేయించిన జిల్లా కలెక్టర్ తీరును ఎండగట్టింది. తనకున్న అధికారాన్ని ఉపయోగించి బాధితురాలిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించడాన్ని తీవ్రంగా పరిగణించింది. న్యాయ వివాదాలు కోర్టులో ఉన్న సమయంలో ఒక ఐఏఎస్ అధికారి పిటిషనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎలా ఆదేశాలు జారీచేస్తారని ప్రశ్నించింది. మీలాంటి వాళ్లను జైళ్లకు పంపాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. తొలుత ఉదయం జరిగిన విచారణకు కలెక్టర్ హాజరుకాకపోవడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కలెక్టర్ మధ్యాహ్నం హాజరయ్యారు.

కలెక్టర్ కోర్టు ధిక్కరణ

మిడ్ మానేరు నిర్మాణ సమయంలో ఇల్లు కోల్పోయిన తనకు ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా అనుపురం గ్రామానికి చెందిన వనపట్ల కవిత అనే నిర్వాసితురాలు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం కవితకు పునరావాసం కల్పించాలని హైకోర్టు 2023లో తీర్పు చెప్పింది. కోర్టు తీర్పు మేరకు తనకు పునరావాసం కల్పించాలని కవిత జిల్లా కలెక్టర్‌ను కోరారు. కోర్టును తప్పుదోవ పట్టించి చట్ట వ్యతిరేకంగా ఆర్డర్ తీసుకొచ్చారన్న అభియోగంతో కవితపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ వేములవాడ ఆర్డీవోకు లిఖితపూర్వక ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాలతో కవితపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును కొట్టేయాలని కవిత హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, న్యాయమూర్తి అనిల్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు.

ఎన్ని రోజులు జైలుకు పంపాలి?

కోర్టు తీర్పును ధిక్కరించడమే కాకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడి కేసు నమోదు చేయడంపై కలెక్టర్ సందీప్‌కుమార్ మీద న్యాయమూర్తి మండిపడ్డారు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరించాలని చెప్పినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కలెక్టర్ హాజరుకాకపోతే ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని వ్యక్తిగతంగా హాజరు కావాలని ఉత్తర్వులివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం జరిగిన విచారణకు కలెక్టర్ స్వయంగా హాజరయ్యారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ స్పందిస్తూ కోర్టు ఉత్తర్వులు ఉండగా పిటిషనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించడం పొరపాటేనని అంగీకరించారు. ఇదే సమయంలో కలెక్టర్ వ్యక్తిగతంగా సురేశ్‌రామ్ అనే న్యాయవాదిని నియమించుకొని వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు దానికి ఉన్నతాధికారులను విచారణకు పిలిపించడం సరికాదన్నారు. కలెక్టర్ చర్య సమర్థనీయమేనని చెప్పారు. పిటిషనర్ కవితపై విచారణ జరిపామని, తప్పుడు సమాచారంతో కోర్టు ఉత్తర్వులు పొందారని, అందుకే కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించామని వివరించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి మీరు కోర్టు రికార్డులు పరిశీలించకుండా కోర్టులో దాఖలైన పిటిషన్లు, కౌంటర్లు పరిశీలించకుండా కలెక్టర్ చెప్పిన విషయాలపై వాదనలు చేయడం సరికాదని హితవు చెప్పారు. ఒక పక్కన ప్రభుత్వం తప్పు జరిగిందని అంగీకరిస్తుంటే.. మరోవైపు మీరు కోర్టు తప్పు చేసింది అన్నట్టుగా ఎలా వాదిస్తారని ప్రశ్నించారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేస్ నమోదు చేయాలని ఎందుకు ఆదేశించారో వివరణ కోరడానికి కలెక్టర్‌ను పిలిస్తే దానిని కోర్టు ధిక్కరణగా పరిగణించడంపై మండిపడ్డారు. ఇదే తీరును కొనసాగిస్తే జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి అధికారి రేపు చీఫ్ సెక్రటరీ అయితే పరిస్థితి ఏమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నాళ్లు జైల్లో పెట్టాలి అని వ్యాఖ్యానించారు. ఆదేశాలు జారీచేసే సమయానికి కోర్టు సమయం ముగియడంతో న్యాయమూర్తి బెంచ్ దిగి వెళ్లిపోయారు. ఆ సమయంలో కోర్టు అధికారులు కలెక్టర్‌ను కోర్టులోనే ఉండాలని చెప్పారు. దీంతో సుమారు రెండు గంటలపాటు కలెక్టర్ కోర్టు హాల్లో నిల్చొనే ఉన్నారు.

సీఎం.. అసెంబ్లీలో ఏం మాటలవి?

మొదటిపేజీ తరువాయి...

వేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది ఆర్యమ సుందరం.. మార్చి 26న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'అధ్యక్షా, సభ్యులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నేను వారికి హామీ ఇస్తున్నాను. ఉప ఎన్నికలు రావు. బీఆర్ఎస్ సభ్యులు వారి సీట్ల కోసం కోరుకున్నా కూడా ఉప ఎన్నికలు రావు. వారు ఇటొచ్చినా, అటొచ్చినా, ఎటొచ్చినా కూడా ఏ ఉప ఎన్నికలు రావు' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని తెలిపారు. దీనిపై జస్టిస్ గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఒకవేళ అసెంబ్లీలో ఈ వ్యాఖ్యలు చేసి ఉంటే.. మీ ముఖ్యమంత్రి 10వ షెడ్యూల్‌ను అవహేళన చేస్తున్నారు' అని పేర్కొన్నారు. బహిరంగ సభల్లో చేసే ప్రసంగాలకు, అసెంబ్లీలో చేసే వ్యాఖ్యలకు వ్యత్యాసం ఉంటుందని అన్నారు. 'రాజకీయ నాయకులు అసెంబ్లీలో ఏదైనా చెప్పినప్పుడు, దానికి కొంత పవిత్రత ఉంటుంది. శాసనాన్ని అర్థం చేసుకోవడానికి అసెంబ్లీలో ఒక మంత్రి చేసిన ప్రకటనను ఉపయోగించుకోవచ్చని చెప్పే తీర్పులు ఉన్నాయి' అని వివరించారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇకపైనైనా జాగ్రత్తగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించాలని న్యాయవాది ముకుల్ రోహత్గీకి సూచించారు. అయితే తాను ముఖ్యమంత్రి తరఫున వాదించడం లేదని, అసెంబ్లీ స్పీకర్ తరఫున మాత్రమే హాజరయ్యానని రోహత్గీ చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'మిస్టర్ రోహత్గీ ఇంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇదే తరహాలో వ్యాఖ్యలు చేసినప్పుడు మీరు ఆయన తరఫున వాదనలు వినిపించారు' అని గుర్తుచేశారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పుడు.. 'బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే బెయిల్ మంజూరు అయింది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయగా.. రేవంత్‌రెడ్డి గతేడాది ఆగస్టులో సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారు. ఇదే విషయాన్ని బుధవారం జస్టిస్ గవాయ్ గుర్తు చేశారు. 'మేము నెమ్మదిగా కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామేమో కానీ.. శక్తిహీనులం మాత్రం కాదు' అని తేల్చి చెప్పారు.

స్పీకర్‌కు విశేష అధికారాలు..

స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవని చెప్పారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తర్వాతే న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందని అన్నారు. నిర్దేశిత కాల పరిమితిలో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదని అన్నారు. అందుకే ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టివేసిందని తెలిపారు. ఒకవేళ న్యాయస్థానం ఏమైనా సూచనలు చేసినా.. వాటిని పాటించాలా? లేదా? అనే నిర్ణయాధికారం స్పీకర్‌దే అని స్పష్టం చేశారు.

మేము చూస్తూ కూర్చోవాలా?

ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుంటూ.. మీ ఉద్దేశంలో సహేతుక సమయం అంటే ఎంతకాలం? అని ప్రశ్నించారు. అనర్హత పిటిషన్లు దాఖలు చేసి 11 నెలలు గడిచినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ.. నిరుడు మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని, ఈ ఏడాది జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారని చెప్పారు. అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన వారం రోజుల్లోపే పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారని చెప్పారు. మరి నోటీసులు జారీ చేయడానికి 10 నెలల సమయం ఎందుకు తీసుకున్నారు? అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని రోహత్గీ చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ ఘాటుగా స్పందించారు. 'కేసు హైకోర్టులో ఉన్నప్పుడు చర్యలు తీసుకోవడం సరైంది కాదు అని అప్పుడు ఆగారు. కానీ విషయం సుప్రీంకోర్టుకు వచ్చిన తరువాత మాత్రం నోటీసులు జారీ చేశారు. ఇది కోర్టు ధిక్కరణ కాదా?' అని నిలదీశారు. 'హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌కు జోక్యం చేసుకోవాల్సిన అవసరమే లేదు. నిజానికి సింగిల్ జడ్జి ఎంతో ఉదారంగా నాలుగు వారాల్లో ఒక షెడ్యూల్‌ను నిర్ణయించాలని మాత్రమే ఆదేశించారు. నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించలేదు' అని పేర్కొన్నారు. స్పీకర్ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేయడమో, ఆదేశించడమో కోర్టులు చేయకూడదా? అని ప్రశ్నించారు. 'మీరు ప్రజాస్వామ్యాన్ని నగ్నంగా నాట్యం చేయిస్తుంటే కోర్టులు చేతులు ముడుచుకొని చూస్తూ కూర్చోవాలా?' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఒకవేళ స్పీకర్ నాలుగేండ్ల పాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోతే కోర్టులు చేతులు కట్టుకొని ఉండాలా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షకులుగా కోర్టులు కచ్చితంగా జోక్యం చేసుకుంటాయని స్పష్టం చేశారు. 'మేము స్పీకర్‌కు సూచనలు ఇస్తాం. ఏదైనా రాజ్యాంగబద్ధ సంస్థ లేదా వ్యవస్థ న్యాయస్థానం సూచనలను మన్నించకపోతే ఏం చేయాలో మాకు తెలుసు. ఆర్టికల్ 142 ప్రకారం మేము శక్తిహీనులం కాదు' అని వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు సమన్లు జారీచేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. 'ధిక్కరణ కేసులో స్పీకర్‌ను కోర్టుకు పిలిచిన సందర్భం కూడా ఉన్నదని మర్చిపోవద్దు' అని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించనున్నారు. అనంతరం.. పిటిషనర్ల తరఫున ఆర్యమ సుందరం సమాధానం ఇవ్వనున్నారు.